క్లుప్తంగా

బాహ్య నందీశ్వరుడికి అభిషేకం

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరురోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం బహుళ త్రయోదశి పురస్కరించుకుని బాహ్య నందీశ్వరుడికి అభిషేకం నిర్వహించారు .ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జాబ్‌మేళాలో 12 మంది ఎంపిక

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరురోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఎంకోర్‌టెక్ అకాడమీ, బెంగుళూరు వారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ప్రాంగణ ఎంపికకు ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరయ్యారు. వివిధ విభాగాల నుంచి 12 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి వార్షిక వేతనంలో రూ.3 లక్షలు ఉంటుందని హెచ్‌ఆర్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. ఎంపికై న విద్యార్థులను కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ రాయుడు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

21న ఉచిత మెడికల్ క్యాంపు

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఈనెల 21వతేదీన ఉచిత మూర్ఛ వ్యాధి మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి తెలిపారు. విజయవాడ జీబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గోపాలం శివనారాయణ క్యాంపు నిర్వహిస్తారన్నారరు. ఫిట్స్‌తో ఇబ్బంది పడుతున్నవారు వైద్య శిబిరానికి హాజరై ఉచితంగా పరీక్షలు చేసుకోవచ్చునన్నారు.ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 7799996609, 9440556284ను సంప్రదించాలని కోరారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

కేవీపల్లె : మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ చీనేపల్లెలో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22వ తేది నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ ఉంటుందని చెప్పారు. అక్టోబర్ 1న శ్రీ సీతారముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

త్వరలో డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు

మదనపల్లె సిటీ: మండల స్థాయిలో జరిగిన స్కూల్‌గేమ్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు త్వరలో డివిజన్ స్థాయిలో పోటీలు జరుగుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అండర్-17 ఖోఖో నిర్వహించారు. మండల స్థాయిలో జరిగిన పోటీల్లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంతో పాల్గొనడం జరిగిందన్నారు. ఖోఖో బాలికల జట్టులో వశిష్ట స్కూల్ విజేతగా నిలిచింది. బాలురు జట్టులో జెడ్పీ ఉన్నత పాఠశాల, సీటీఎం విజేతగా నిలిచింది. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్లు శివశంకర్,లత పీడీలు భద్రయ్య, నరేష్, అన్సర్, దేవకమ్మ, భారతి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

రామసముద్రం : మండలంలో శుక్రవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్‌లో చెంబకూరు పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఎంఈఓ- 2 ఆంజనేయులు తెలిపారు. రన్నింగ్, షాట్ పుట్, లాంగ్ జంప్, హైజంప్ క్రీడా పోటీల్లో విశేష ప్రతిభ కనబరచిచారన్నారు. వీరిని అన్నమయ్య జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నాగరాజు, ఝాన్సీరాణి, పాఠశాల హెచ్ ఎం రమేష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్స్ దిలీప్ కుమార్, మంజుల, పాఠశాల సిబ్బంది అభినందించారు. సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ క్రీడల వలన కలుగు ప్రయోజనాలు, 3శాతం క్రీడా రిజర్వేషన్, ఈ సంవత్సరం ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయిలో పాల్గొనే క్రీడాకారుల రిజర్వేషన్ సౌకర్యం, భోజన వసతి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

గర్భిణులు, ప్రసూతి తల్లులకు పౌష్టికాహారం

రామసముద్రం : గర్భిణీలకు, ప్రసూతి తల్లులకు పౌష్టికాహారం ఎంతో అవసరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి తెలిపారు. శుక్రవారం కెసిపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, ప్రసూతి తల్లులు పౌష్టికాహారం తీసుకోవడం, పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యం కోసం పురుషుల భాగస్వామ్యం గురించి వివరించారు.

స్కౌట్‌తో క్రమశిక్షణ

కేవీపల్లె : స్కౌట్‌తో విద్యార్థుల్లో మంచి క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతుందని స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మూడే శీను నాయక్ అన్నారు. స్కౌట్ అండ్ గేమ్స్‌లో ప్రవేశం పొంది మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. స్కౌట్ మాస్టరు చెన్నూరి బాలాజీ, నాగేంద్ర, గైడ్ కెప్టెన్ జె. లీలావతి, ఉపాధ్యాయులు బాలాజి, షేర్ బాను, మల్లికార్జున, జయచంద్ర పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం





మదనపల్లె నిరసన కార్యక్రమానికి తరలివెళుతున్న పీలేరు వైఎస్సార్‌సీపీ నాయకులు, మదనపల్లి మెడికల్ కళాశాల వద్ద వాల్మీకిపురం నేతల నిరసన, కలకడ పార్టీ కార్యకర్తలు, విద్యార్థుల నిరసన

- మదనపల్లెలో నిరసన
- వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్‌రెడ్డి

పీలేరు : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి భీరేంద్రవర్మ, రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి సుంకర చక్రధర్ అన్నారు. శుక్రవారం వైద్య కళాశాల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ తలపెట్టిన మదనపల్లెలో నిరసన కార్యక్రమానికి పీలేరు నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య విద్య అందించాలని రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేస్తే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరం చేస్తోందని ఆరోపించారు. వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని చూడడం చాలా దారుణమన్నారు. ఎవరైనా ప్రయివేట్ వ్యక్తులు టెండర్లు వేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇకనైన కూటమి ప్రభుత్వం కళ్లు తెరచి గత ప్రభుత్వం ఇచ్చిన మెడికల్ కళాశాలల నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహితా ఆనంద్, పి. ద్వారకనాథరెడ్డి, లోకనాథరెడ్డి, కాలనీ చిన్న, అశోక్ నాయుడు, విక్టరీ వెంకటరమణారెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, సురేంద్రనాథరెడ్డి, లోక, రవి, పురుషోత్తం, కుసుమశేఖర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, నాగేశ్వరి, సి.కె. యర్రమరెడ్డి, ధర్మారెడ్డి, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగ్రహం తప్పదు

కలికిరి(వాల్మీకిపురం): రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపకపోతే కూటమి ప్రభుత్వానికి ప్రజాగ్రహం తప్పదని పీలేరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నీళ్ళ భాస్కర్, ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీం, మండల పార్టీ కన్వీనర్ పులి శివకుమార్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ పిలుపుమేరకు శుక్రవారం చలో మెడికల్ కళాశాలల కార్యక్రమంలో భాగంగా మదనపల్లి మెడికల్ కళాశాల నిరసన కార్యక్రమానికి వాల్మీకిపురం మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేసి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఘనత సాధించారన్నారు. కూటమి ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చిన మంచి పేరును సహించలేక పీపీపీ విధానంతో కళాశాలల ప్రైవేటీకరణకు కంకణం కట్టుకుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, నరసింహులు, ఆనంద్, రఘు, రమేష్, లక్ష్మీనారాయణ రెడ్డి, చలపతి, విశ్వనాథ, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ నిర్ణయాలు విద్యార్థులకు శాపం

కలకడ : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడం అనే కూటమి ప్రభుత్వ నిర్ణయం విద్యార్థులకు శాపమని పీలేరు నియోజకవర్గ మైనార్టీసెల్ అధ్యక్షులు కెఎస్ మస్తాన్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు కెసిరెడ్డి. దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మదనపల్లె సమీపంలోని శానోటోరియం (ఆరోగ్యవరం) వద్ద వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు తలపెట్టిన గతప్రభుత్వం మంజూరు చేసి నిర్మాణంలో మెడికల్‌కళాశాల వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో కలకడ మండలం నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అప్రజాస్వామికం

పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కలికిరి: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అప్రజాస్వామికమని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి వైఎస్సార్‌సీపీ కృషి చేస్తోందన్నారు. పేద విద్యార్థులకు సైతం వైద్య విద్యను అందివ్వడానికి, కార్పొరేట్ స్థాయి వైద్యం సామాన్యులకు దగ్గర చేయడానికి రాష్ట్రంలో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. వీటిలో దాదాపు పది కళాశాలలు పూర్తి స్థాయిలో నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయన్నారు. కొన్ని కళాశాలల్లో రెండేళ్ళుగా వైద్య విద్యార్థులకు తరగతులు జరుగుతున్నాయని గుర్తుచేశారు. సింహభాగం పూర్తైన కళాశాలను పూర్తి చేయాల్సిన కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా, దుర్మార్గంగా వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం దారుణమన్నారు. చంద్రబాబు నాయుడు ఒక్క మెడికల్ కాలేజీని కూడా నిర్మించలేదని, జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన కళాశాలలను కూడా తన అనుయాకులకు కట్టబెట్టడం కోసం పీపీపీ విధానం తీసుకొస్తున్నారన్నారు. పేద విద్యార్థులు, ప్రజల కోసం వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నారు.

రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్ సాంకేతిక లోపాలు సరిదిద్దాలి

– దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖరుల నిరసన

మదనపల్లె రూరల్ : రిజిస్ట్రేషన్‌శాఖకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ సాంకేతిక లోపాలతో దస్తావేజు తయారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని, వీటిని సరిదిద్దేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దస్తావేజు లేఖరులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ దస్తావేజు లేఖరుల సంఘం కార్యదర్శి కంగేరినందా మాట్లాడుతూ రిజిస్ట్రేషన్‌శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాలతో దస్తావేజు లేఖరులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆధార్, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉండటంతో దస్తావేజు తయారీ జఠిలమవుతోందన్నారు. దీనిద్వారా క్రయ,విక్రయదారులు, దస్తావేజులేఖరుల విలువైన సమయం వృథా అవుతోందన్నారు. ఓటీపీ విధానంతో ప్రజల వ్యక్తిగత సమాచారం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉందన్నారు వయోవృద్ధుల వీలునామా నమోదు విషయంలోనూ ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లె దస్తావేజులేఖరుల సంఘం అధ్యక్షులు రంగు గుణశేఖర్, ఉపాధ్యక్షులు ఎం.నాగమునీంద్ర, కరూర్ వెంకటేష్, రంగురాజేంద్ర, మొగిలి శ్రీరామయ్యగుప్తా, ఇమ్రాన్‌ఖాన్, యూసుఫ్, నూర్ మహమ్మద్ తాహిర్, శ్రీనివాసులు నాయుడు, సాయిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

పీలేరు రూరల్ : బాలికలు, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని రేగళ్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. రాధామాధవి అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీనాథపురం కాలనీ ప్రభుత్వ పాఠశాల, చిత్తూరు రోడ్డు మార్గంలో జ్యోతిబాపూలే పాఠశాలలో బాలికల ఆరోగ్యంపై వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో మధుమేహం, రక్తపోటు, గర్భాశయ క్యాన్సర్, కిశోర బాలికల ఆరోగ్యం గూర్చి అవగాహన కల్పించారు. సరైన పోషకాహారం తీసుకోవాలని, వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కృష్ణమ్మ, సిబ్బంది చిన్నప్ప, రాజీమణి, రెడ్డికుమారి, ద్రాక్షాయణి, శివప్రసాద్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే ముస్లింల సంక్షేమం



ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న నిసార్ అహ్మద్

మదనపల్లె: వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ముస్లింల సంక్షేమం జరిగిందని వైఎస్సార్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని బీకేపల్లె ప్రాంతంలో పర్యటించారు. ఇక్కడి ముస్లింలను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇక్కడి మసీదులో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. మతపెద్దలు, పార్టీ నాయకులతో సమావేశమై ముస్లింల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి పనిచేసిందన్నారు. సంక్షేమ పథకాలను అందించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందన్నారు.

మహిళా ఆరోగ్యం కుటుంబానికి ఆలంబన



గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష

నిమ్మనపల్లె : మహిళా ఆరోగ్యం కుటుంబానికి ఆలంబన అవుతుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మహమ్మద్ రఫీ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంగంవారిపల్లెలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా మహిళలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయన్నారు. గర్భిణిలకు పౌష్టికాహారం పంపిణీ, క్యాన్సర్ స్క్రీనింగ్, జీవనశైలి మార్పులపై అవగాహన కార్యక్రమాలు, వ్యాధినిరోధక టీకాలు, పీఎం ఆరోగ్య బీమా కార్డుల నమోదు, సికిల్‌సెల్ వైద్యపరీక్షలు తదితర చర్యలు తీసుకుంటున్నారన్నారు. మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం మహిళలచే స్వస్థ నారీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి, సూపర్‌వైజర్లు దేవేంద్ర, దేవకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు శకుంతల, కరుణ, ఏఎన్‌ఎం శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

రామసముద్రం : రామసముద్రం మండలం కుదురుచీమనపల్లి గ్రామంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్వస్త్ నారి- సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యుష హాజరైన మహిళలకు చికిత్స చేశారు. గర్భిణీ స్త్రీలకు, టి.బి. రోగులకు, అన్ని వయస్సు గల మహిళలకు ఆరోగ్య పరీక్షలు, కాన్సర్ స్క్రీనింగ్, బి.పి. షుగర్, రక్త హీనత పరీక్షలు చేశారు. 60మంది మహిళలు చికిత్స లు చేయించుకున్నారు. వారికి న్యూట్రిషన్ గురించి వివరించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించి అవగాహన కల్పించారు. పరీక్షల అనంతరం వ్యాధి తీవ్రతను బట్టి మదనపల్లి, తిరుపతికి రెఫర్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించండి

- జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



వ్యవసాయ శాఖ సిబ్బందితో ఆరా తీస్తున్న జాయింట్ కలెక్టర్

పెద్దతిప్పసముద్రం: ప్రతి ఒక్కరూ విధుల పట్ల అలసత్వాన్ని వీడి బాధ్యతగా పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం జేసీతో పాటు మదపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. ముటేషన్లు, సుమోటో ధృవ పత్రాలు, పెండింగ్‌లో ఉన్న రైతుల సమస్యలు, అన్నదాత సుఖీభవ ఎంత మంది రైతులకు రాలేదు, ఈ ప్రాంత రైతులకు రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నాయి, ప్రధాన చెరువుల స్థితిగతులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు కాలయాపన చేయకుండా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలని హితబోధ చేసారు. అనంతరం సమీపంలోని వ్యవసాయ పొలాన్ని సందర్శించి క్రాప్ బుకింగ్ నమోదును పరిశీలించారు. పంట నమోదులో సాంకేతిక లోపాలు వస్తున్నాయా, క్రాప్ బుకింగ్ ఎలా చేస్తున్నారు, వీటి వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా అని అడిగి పంట నమోదును వేగవంతం చేయాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఏవో ప్రేమలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి



పీలేరులో ధర్నా నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు



గుర్రంకొండలో వీఆర్‌ఏల నిరసన

పీలేరు రూరల్ : వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ తమకు పే స్కేల్ అమలు చేయాలని కోరారు. అర్హత గల వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న ఆర్డీవో కార్యాలయం, 22న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం అధ్యక్షులు కె. నాగరత్నం, ఉపాధ్యక్షులు జి.వి. రమణ, కార్యదర్శి ధనలక్ష్మి, ట్రెజరర్ పి. ఆంజినేయులు, వీర్‌ఏలు ఆదినారాయణ, రవి, హరి, నాగరాజ, రాజేశ్వరి, నాగేంద్ర, మల్లికార్జున, మనోజ్, విష్ణువర్ధన్, సిద్ధయ్య పాల్గొన్నారు.

గుర్రంకొండలో వీఆర్‌ఏల ధర్నా

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకు వారంతా చేరుకొని ధర్నా చేశారు. అనంతరం అక్కడే నిరాహార దీక్షకు పూనుకొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి వీఆర్‌ఏకు ఉద్యోగోన్నతి కల్పిచాలన్నారు. నామినీ వీఆర్‌ఏలను రెగ్యులర్ ఉద్యోగులుగా పరిణించి ఆదేశాలు ఇవ్వాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేసే అటెండర్లు, నైట్‌వాచ్‌లను ఉద్యోగన్నతులు కల్పించాలన్నారు. న్యాయమైన తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షులు మురళీ, సంఘం నాయకులు సురేష్, రెడ్డిశేఖర్, రామేశ్వరమ్మ, లలిత, వెంకటరమణ పాల్గొన్నారు.

సమస్యలపై వీఆర్‌ఏల ధర్నా

బి.కొత్తకోట: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వీఆర్‌ఏలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పేస్కేలు అమలు, నామినీలను వీఆర్‌లుగా నియమించాలని, అర్హులకు ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు సమస్యలపై వినతిపత్రం అందించారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు సూచనలిస్తున్న డీఎస్పీ మహేంద్ర

ములకలచెరువు: మదనపల్లె డీఎస్పీ మహేంద్ర శుక్రవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సోంపల్లె పంచాయతీ కోనేటివారిపల్లి, సత్యసాయి జిల్లా సరిహద్దు ఈదుల వంక వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిని పరిశీలించారు. వర్షాల కారణంగా వాగులు, వంకలు ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అనవసరంగా ఇళ్లల్లో నుండి బయటకు రావద్దని సూచించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నరసింహుడు పాల్గొన్నారు.

ఉద్యం పోర్టల్ రిజిస్ట్రేషన్‌తో ప్రయోజనాలు

మదనపల్లె రూరల్ : చిన్న పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉద్యం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే అనేక ప్రయోజనాలు పొందవచ్చని ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్(ఐపీఓ) డి.శంకరప్ప అన్నారు. శుక్రవారం పట్టణంలోని వెలుగు కార్యాలయం స్త్రీశక్తి భవన్‌లో ఏపీ ఎంఎస్‌ఎంఈ, అన్నమయ్యజిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఉద్యం పోర్టల్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐపీఓ శంకరప్ప మాట్లాడుతూ...ఉద్యం పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవడం వల్ల సాధారణం కన్నా తక్కువ వడ్డీకి రుణాలు పొందవచ్చన్నారు. ఉద్యం సర్టిఫికేట్ ఉన్న ఎంఎస్‌ఎంఈ కంపెనీలకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తాయన్నారు. ఉద్యం రిజిస్ట్రేషన్ ఉన్న కంపెనీలకు తక్కువ వడ్డీకి రూ.కోటివరకు లోన్లు పొందవచ్చన్నారు. ఉద్యం రిజిస్ట్రేషన్ ద్వారా... ప్రభుత్వ పథకాలు, తక్కువ వడ్డీకే ఎంఎస్‌ఎంఈ వ్యాపార రుణాలు, ఎంఎటీ క్రెడిట్ పొడిగింపు, ఖర్చుల తగ్గింపు, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాలు, ప్రభుత్వ టెండర్లను సులభంగా పొందే అవకాశం లభిస్తుందన్నారు. ఉద్యం పోర్టల్‌లో కంపెనీని రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా వ్యాపార భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవచ్చన్నారు. వ్యాపార, సేవా, పరిశ్రమల నిర్వాహకులు ఉద్యం పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



ఉరుసు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రం కదిరి రోడ్డులో వెలసిన హజ్రత్ మహబూబే సుబహాని దర్గా ఉరుసు ఉత్సవాల పోస్టర్లను నిర్వాహకులు శుక్రవారం ఆవిష్కరించారు. అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీపోత్సవం, ఉరుసు, గంధం, ఖవ్వాలీ పోటీలు ఉంటాయని, స్థానిక ప్రజలు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు అగ్రహారం కాలేషా, జహీర్, మస్తాన్, రఫీ, బావాజీ తదితరులు ఉన్నారు.

పొంగి ప్రవహిస్తున్న చెరువులు, వాగులు



మండల సరిహద్దులో రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపునీరు



సానేవారిపల్లె వద్ద వర్షపునీటికి తెగిపోయిన తారురోడ్డు

ములకలచెరువు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని పలు చెరువులు, కుంటలు పొంగి ప్రవహిస్తున్నాయి. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పెద్దేరు, చిన్నేరు, అలాగే బురకాయలకోట పచ్చచెరువు, దేవులచెరువు, శేషమ్మచెరువు, కుంటలు పొంగి ప్రవహిస్తున్నాయి. చౌడసముద్రం వద్ద పెద్దేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తంబళ్లపల్లె నుంచి ములకలచెరువుకు రాకపోకలు స్తంభించాయి. సోంపల్లి పంచాయతీ సానేవారి పల్లె వద్ద జవకలచెరువు తెగిపోవడంతో నీటి ఉధృతికి తారురోడ్డు తెగిపోయింది. ములకలచెరువు సరిహద్దు ఈదులవంక ప్రవహిస్తుండడంతో శుక్రవారం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జాతీయ రహదారి కావడంతో వాహనాలు కిలోమీటర్ మేర నిలబడిపోయాయి. వరద ఉధృతి తగ్గడంతో వాహనాల రాకపోకలు సాగాయి. వాగుల వద్ద ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రత కల్పించారు. మండల వ్యాప్తంగా 30 ఎకరాల్లో మొక్కజొన్న 30 పంట నష్టవాటిల్లినట్లు ఏఓ శ్రవంతి తెలిపారు. మండల వ్యాప్తంగా 252 మీ.వీ వర్షపాతం నమోదైంది.

స్వామిత్ర సర్వే గడువులోగా పూర్తిచేయండి



స్వామిత్ర సర్వేను తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ

గుర్రంకొండ: స్వామిత్ర సర్వే నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని డీఎల్‌డీవో లక్ష్మీపతి అన్నారు. శుక్రవారం మండలంలోని గుర్రంకొండ పట్టణంలో నిర్వహిస్తున్న స్వామిత్ర సర్వేను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఇంతవరకు జరిగిన సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. పట్టణంలో 90 శాతం మేరకు స్వామిత్ర సర్వే పూర్తి చేసినట్లు అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిగిలిన 10 శాతం సర్వే పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. సర్వే పనులు పూర్తి అయిన వెంటనే ప్రాపర్టీ కార్డులు ప్రతి కుటుంబానికి పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ ఈఓ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.